www.siridaily.com
తెలుగు డిజిటల్ న్యూస్
# సిరి
...People Voice
సోమవారం, డిసెంబర్ 16, 2024 | సంపుటి-1 సంచిక-5 | పేజీలు - 4

- ఒక్క ఇల్లయిన కట్టావా
- ప్రశ్నిస్తే ప్రజలపై దాడులు..
- అనుచరులకు అక్రమంగా నోట్లు
- సీఎం రేవంత్ రెడ్డి పై మంత్రి హరీష్ రావు ఫైర్

## ఏడాది పాలనలో రేవంత్‌ది హిట్ వికెట్

### రాహుల్ అపాయింట్మెంట్ దొరకని పరిస్థితి నీది..

మూడు రోజుల ఢిల్లీ పర్యటనలో ఏఐసీసీ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, సోనియాగాంధీ అపాయింట్మెంట్ దొరకని దుర్భర పరిస్థితిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని, 6 గ్యారంటీల హామీల అమలులో ఘోరంగా విఫలమయ్యారని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు విమర్శించారు. ఆదివారం అమీన్పూర్ లో ఆయన మాట్లాడుతూ.. క్రికెట్ ఆటలో హిట్ వికెట్ ఎలాగో వీడాది పాలనలో సీఎం రేవంత్ రెడ్డి పరిస్థితి అదేనని విమర్శించారు.



4



# పల్లెల్లో స్థానిక లొల్లి !

### పంచాయతీ ఎన్నికలపై మళ్లీ మొదలైన సందడి

పల్లెల్లో మళ్ళీ స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా మారిన రాజకీయ పరిణామాలు..ఓవైపు రిజర్వేషన్ల దామాషా ఖరారుపై బీసీ కమిషన్ కసరత్తు..మరోవైపు అన్నీ కలిసొస్తే జనవరిలో ఎన్నికల నోటిఫికేషన్ జారీ కావచ్చని మంత్రుల ప్రకటనలతో ఒక్కసారిగా మళ్ళీ గ్రామ పంచాయతీలో చర్చ మొదలైంది. ఇప్పటికే గ్రామ పంచాయతీలు, వారుల వారీగా ఓటరు జాబితా సిద్ధం కాగా రిజర్వేషన్లు ఖరారు కావాల్సి ఉంది. ఆ ప్రక్రియ కూడా వేగంగా జరుగుతున్న క్రమంలో సంక్రాంతి నాటికి సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు ఉండొచ్చన్న ప్రచారం జోరందుకుంది. ఈ నేపథ్యంలో రిజర్వేషన్లు కలిసొస్తే పోటీ చేయాలన్న సంకల్పంతో ఉన్న ఆశావహులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

– ప్రత్యేక ప్రతినిధి – సిరిన్యూస్

- రిజర్వేషన్ల దామాషా ఖరారుపై బీసీ కమిషన్
- మరోవైపు త్వరలోనే ఎన్నికలంటూ మంత్రుల ప్రకటన
- ఇప్పటికే జీపీల వారీగా ఓటరు జాబితా సిద్ధం
- పది నెలలుగా పంచాయతీల్లో ప్రత్యేక పాలన

2





## పకడ్బందీగా గ్రూప్ -2 పరీక్షలు

- ఉమ్మడి జిల్లాలో ప్రశాంతం
- ఆలస్యం కావడంతో పలువురికి చుక్కెదురు
- ఎంఎన్ఆర్ కాలేజీలో సెల్‌ఫోన్ డిపాజిట్ పేర డబ్బులు వసూలు
- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్లు

4

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్షలు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల నడుమ ఆదివారం ప్రారంభం అయ్యాయి. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఈ పరీక్షలను నిర్వహించారు. పరీక్ష కేంద్రాలను ఆయా జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పోలీసులు సందర్శించారు.

సంగారెడ్డి టౌన్, ( సిరిన్యూస్)





## మొలసి కలకలం

- అందోల్ శివారులో ప్రత్యక్షం
- అల్మాయిపేట మంజీరా పరివాహ ప్రాంతంలో సంచారం
- భయాందోళనలో స్థానిక ప్రజలు

2

- సంగారెడ్డిలో రెచ్చిపోతున్న కబ్జారాయుళ్లు
- సర్వే నంబర్ 403లో వెయ్యి గజాల పార్కు స్థలం
- రాంచంద్రారెడ్డి కాలనీలో భాగోతం
- కలెక్టర్ స్పందించాలని స్థానికుల విజ్ఞప్తి

# కబ్జా కోరల్లో పార్కు స్థలం !

కబ్జాదారులకు అడ్డూ అదుపు లేకుండా పోతుంది. ఏకంగా ప్రభుత్వ స్థలాన్ని పార్కు కోసం కేటాయించగా కబ్జారాయుళ్ళు ఆక్రమించేందుకు కుట్ర పన్నుతున్నారు. అధికారుల అండదండలతో అనుకున్నదే తడవుగా వెయ్యి గజాల పార్కు స్థలాన్ని ప్లాట్లుగా విక్రయిస్తున్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ స్పందించి పార్కు స్థలాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు. – సంగారెడ్డి టౌన్, (సిరిన్యూస్)





2



## నిరుపేదలకు ఆపన్న హస్తం సీఎంఆర్ఎఫ్

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- రూ. 2.50 లక్షల ఎల్ఓసి అందజేత

**పటాన్‌చెరు, డిసెంబర్ 15(సిరిన్యూస్)** ఆపద కాలంలో ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు ఆపన్న హస్తం అందిస్తోందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గుమ్మడిదల గ్రామానికి చెందిన భోగయ్య కుమారుడు శ్రీనివాస్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో మెరుగైన చికిత్స కోసం స్థానిక ఎమ్మెల్యే ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. చికిత్స కోసం మంజూరైన 2 లక్షల 50వేల రూపాయల విలువైన ఎల్ఓసి అనుమతి పత్రాన్ని ఆదివారం ఎంఎల్ఏ జిఎంఆర్ శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. పూర్తి పారదర్శకతతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజా పాలన అందిస్తున్నామని తెలిపారు.

## అయ్యప్ప పూజ పడి పూజ

**పాల్గొన్న మాజీ మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే సునీతారెడ్డి**

**వెల్దుర్తి, డిసెంబర్ 15 (సిరి న్యూస్) :** వెల్దుర్తి మండలం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వంచ భూపాల్ రెడ్డి గురు స్వామి చేస్తున్న 18వ మహా పడిపూజ మహోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు, నర్సాపూర్ శాసన సభ్యురాలు వాకిటి సునీత లక్ష్మారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ స్వామి వారి కృపతో రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో గురుస్వామి వంచ భూపాల్ రెడ్డి, శివంపేట్ మండల పరిషత్ అధ్యక్షులు హరికృష్ణ, తూప్రాన్ మాజీ మున్సిపల్ చైర్మన్ రవీందర్ గౌడ్ , గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్ర గౌడ్, వెల్దుర్తి మాజీ జడ్పిటిసి సభ్యులు రమేష్ గౌడ్, ముఖ్య నాయకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





# పల్లెల్లో స్థానిక లొల్లి!

- పంచాయతీ ఎన్నికలపై మళ్లీ మొదలైన సందడి
- రిజర్వేషన్ల దామాషా ఖరారుపై బీసీ కమిషన్
- మరోవైపు త్వరలోనే ఎన్నికలంటూ మంత్రుల ప్రకటన
- ఇప్పటికే జీపీల వారీగా ఓటరు జాబితా సిద్ధం
- పది నెలలుగా పంచాయతీల్లో ప్రత్యేక పాలన

**ప్రత్యేక ప్రతినిధి-సిరిన్యూస్ :** పల్లెల్లో మళ్ళీ స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా మారిన రాజకీయ పరిణామాలు..ఓవైపు రిజర్వేషన్ల దామాషా ఖరారుపై బీసీ కమిషన్ కసరత్తు..మరోవైపు అన్నీ కలిసొస్తే జనవరిలో ఎన్నికల నోటిఫికేషన్ జారీ కావచ్చని మంత్రుల ప్రకటనలతో ఒక్కసారిగా మళ్ళీ గ్రామ పంచాయతీలో చర్చ మొదలైంది.

### రిజర్వేషన్లపై త్వరలో నిర్ణయం?

పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలన్న స్పష్టత వచ్చినా..పాత రిజర్వేషన్లతో ముందుకు పోవడమా ? కొత్త రిజర్వేషన్ల ఖరారు తర్వాతే నిర్వహిస్తారా ? అనే అంశంపై సందిగ్ధత నెలకొంది. పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ తొలుత భావించింది. అయితే పాత రిజర్వేషన్ల ద్వారా ఎన్నికలు నిర్వహిస్తే బీసీలు నష్టపోతారని విపక్షాలు ఆరోపించడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కులగణన చేపట్టిన తర్వాతే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంఘాలు పట్టుబట్టడంతో ప్రభుత్వం బీసీ కులగణనకు శ్రీకారం చుట్టింది. ఈనెలాఖరు నాటికి బీసీ కులగణన, బీసీ కమిషన్ అభిప్రాయ సేకరణ పూర్తి చేసి త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. ఇలావుండగా జనవరిలో పంచాయతీ ఎన్నికలు తథ్యమన్న సంకేతాలతో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మరింత దూకుడు పెంచాయి. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలను విస్తృతం చేశాయి.

### అధికారులకు సంకేతాలు ?

ఎప్పుడు నోటిఫికేషన్ వెలువడినా ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా సన్నద్ధం కావాలని ప్రభుత్వం నుంచి అధికారులకు ఆదేశాలు అందినట్లు తెలిసింది. ఈ మేరకే ఇటీవల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన చీఫ్ సెక్రటరీ శాంతికుమారి కలెక్టర్లకు సంకేతాలు ఇచ్చినట్లు చెబుతున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో అధికార యంత్రాంగం గ్రామ పంచాయతీ ఎన్నికలకు సర్వ సన్నద్ధమవుతోంది. సంక్రాంతి లేదా ఫిబ్రవరి నాటికి పల్లెల్లోకొత్త వ్యవస్థ కొలువుదీరేలా చూడాలన్న ప్రభుత్వ సంకల్పం మేరకు ఆ దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు. ఇలావుండగా ఈ ఏడాది ఫిబ్రవరితో సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో పాలనాపరంగా ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు ప్రభుత్వం స్పెషల్ ఆఫీసర్లను నియమించింది. అయితే పది నెలలుగా వారి ఆధ్వర్యంలోనే పాలన కొనసాగుతుండగా అధికారులు, సిబ్బంది కొరత కారణంగా చాలా గ్రామాల్లో పారిశుద్ధ్యం సమస్య తలెత్తుతోంది. దీంతో ఎన్నికల నిర్వహణే సరియైన మార్గమని భావిస్తున్న సర్కార్ ఆ దిశగా దృష్టి సారించిందన్న ప్రచారం జరుగుతోంది. ఎన్నికల సంఘం కూడా అధికారులను అప్రమత్తం చేస్తోంది.

# కబ్జా కోరల్లో పార్కు స్థలం !

- సంగారెడ్డిలో రెచ్చిపోతున్న కబ్జారాయుళ్లు
- సర్వేనంబర్ 403లో వెయ్యి గజాల పార్కు స్థలం
- రాంచంద్రారెడ్డి కాలనీలో భాగోతం
- కలెక్టర్ స్పందించాలని స్థానికుల విజ్ఞప్తి



**సంగారెడ్డి టౌన్, డిసెంబర్ 15(సిరిన్యూస్)** కబ్జాదారులకు అడ్డూ అదుపు లేకుండా పోతుంది. ఏకంగా ప్రభుత్వ స్థలాన్ని పార్కు కోసం కేటాయించగా కబ్జారాయుళ్ళు ఆక్రమించేందుకు కుట్ర పన్నుతున్నారు. అధికారుల అండదండలతో అనుకున్నదే తడవుగా వెయ్యి గజాల పార్కు స్థలాన్ని ప్లాట్లుగా విక్రయిస్తున్నారు. సంగారెడ్డి పట్టణంలోని 34వ వార్డు రాంచంద్రారెడ్డి కాలనీలో సర్వే నెంబర్ 403 లో మాస్టర్ ప్లాన్ ప్రకారం ప్రభుత్వం 1991లో ఎల్.పీ నంబర్ 18/91/UPHS ప్రకారం ప్రభుత్వం లే అవుట్ చేసి 53 ప్లాట్లను పట్టణంలోని నిరుపేదలకు కేటాయించింది. ప్లాట్ లు చేయగా మిగిలిన స్థలాన్ని స్థానిక కాలనీవాసుల కోసం మాస్టర్ ప్లాన్ ప్రకారం పార్క్ కోసం స్థలాన్ని వదిలేయడం జరిగింది. ఇదే అదనుగా భావించిన కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు పార్కు స్టలం సర్వే నెంబర్ 403 లో దాదాపు వెయ్యి గజలకు పైగా ఉండడంతో నకిలీ పత్రాలు సృష్టించి చిన్న చిన్న ప్లాట్లు చేసి విక్రయిస్తున్నట్లు కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కోట్లు విలువ చేసే పార్కు స్టలం కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నా మున్సిపల్ , రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. కబ్జా విషయంపై కాలనీ వాసులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటున్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ స్పందించి పార్కు స్థలాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాలనీలో పార్కు నిర్మాణం కూడా చేపట్టాలని కోరుతు



## మొసలి కలకలం

**ఆందోల్, డిసెంబర్ 15(సిరిన్యూస్)** ఆందోల్ మండలం అల్మాయిపేట గ్రామ శివారులో మంజీర నది పరివాహ ప్రాంతంలో మొసలి నది మధ్యలో బండ పైన పడుకొని ఉన్న దృశ్యాన్ని మత్స్యకారులు చూసి భయాందోళన వ్యక్తం చేశారు. గత రెండు రోజులుగా మంజీరా పరివాహక ప్రాంతంలో రెండు మొసలి పిల్లలను చూసినట్టు మత్స్యకారులు చెప్పారు. దీంతో మంజీరా పరిహాహక ప్రాంతంలోని గ్రామాల మత్స్యకారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. పశువుల, గొర్ల కాపరులు పరివాహక ప్రాంతాలకు వెళ్లరాదని అధికారులు సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

**ఆందోల్, డిసెంబర్ 15(సిరిన్యూస్) :** ఆందోల్ మండల పరిధిలోని అన్నసాగర్ వై జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు అయ్యాయి. చిలిపిచేడు మండలం పైజాబాద్ తాండకు చెందిన శ్రీకాంత్.రవి,బాబు అనే ముగ్గురు వ్యక్తులు బైక్ పైన అజాగ్రత్తగా అతివేగంగా వస్తు పక్కనే ఉన్న వైకుంఠ ద్వామం వద్ద గల స్తంభానికి ఢీ కొట్టారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనంలో క్షతగాత్రులను జోగిపేట ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.



## రక్తంతో చిత్రపటం

### అభిమాన నేత కాట శ్రీనివాస్ గౌడ్ కు అందజేసిన కాంగ్రెస్ కార్యకర్త

**పటాన్ చెరు, డిసెంబర్ 15(సిరిన్యూస్) :**

అభిమానానికి హద్దులు ఉండవు అనడానికి ఇదే ప్రత్యక్ష నిదర్శనం. పటాన్ చెరు మండలం లక్డారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త రామచంద్రా రెడ్డి(డీసీపీ) కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ కు వీరాభిమాని. ఇటీవల జరిగిన కాట శ్రీనివాస్ గౌడ్ జన్మదినం సందర్భంగా రామచంద్రారెడ్డి తన రక్తంతో కాట శ్రీనివాస్ గౌడ్ చిత్రపటాన్నివేయించి బహుమతిగా అందజేశారు. అభిమాని తన రక్తంతో చిత్రపటాన్ని వేయించి అందించడంతో కాట శ్రీనివాస్ గౌడ్ కొంత భావోద్వేగానికి లోనయ్యారు. తన అభిమానిని గుండెలకు హత్తుకున్నాడు.

# విద్యార్థుల దాడి అవాస్తవం

-సంగారెడ్డి ఆర్డీవో రవీందర్ రెడ్డి - డీఎస్పీతో కలిసి గిర్మాపూర్ గురుకుల పాఠశాలలో విచారణ

**సంగారెడ్డి టౌన్, డిసెంబర్ 15 ( సిరిన్యూస్)** గిర్మాపూర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులు పరస్పరం దాడులు చేసుకున్నారనడంలో వాస్తవం లేదని సంగారెడ్డి ఆర్డీవో రవీందర్ రెడ్డి అన్నారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదవ తరగతి, ఆరవ తరగతి విద్యార్థులు పరస్పరం దాడి చేసుకున్నారని వదంతులు వ్యాప్తి చెందడంతో జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశాల మేరకు సంగారెడ్డి ఆర్డీవో రవీందర్ రెడ్డి, సంగారెడ్డి డీఎస్పీ సత్యగౌడ్ లు ఆదివారం గిర్మాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థులను వేరువేరుగా విచారణ జరిపారు. పాఠశాలలో ఎలాంటి దాడి సంఘటనలు జరగలేదని ఆర్డిఓ తెలిపారు. అనవసరంగా లేనిపోని వదంతులను వ్యాప్తి చేసి విద్యార్థులను వారి తల్లిదండ్రులను అభద్రతాభావానికి గురి చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. వారం రోజులకు ఒకసారి స్థానిక తహసిల్దార్, ఎస్సైలు పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని ఆదేశించినట్లు ఆర్డీవో తెలిపారు.

# ప్రభుత్వాలు మారినా కార్మికుల బతుకులు మారలే

### సిఐటియు జిల్లా కార్యదర్శి సాయిలు

**హత్నూర, డిసెంబర్ 15(సిరిన్యూస్)** ప్రభుత్వాలు ఎన్ని మారినా గ్రామ పంచాయతీ కార్మికుల బతుకులు మారడం లేదని సిఐటియు జిల్లా కార్యదర్శి సాయిలు అన్నారు. మండలంలోని దౌల్తాబాద్ గ్రామంలో ఆదివారం గ్రామ పంచాయతీ కార్మికుల సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ళ తరబడి పంచాయతీ కార్మికులు చాలీచాలని వేతనాలతో బతుకులీడుస్తున్నారని వారు పేర్కొన్నారు. వేతనాలు పెంచాలని పలుమార్లు గత ప్రభుత్వాలను కోరినా పని భారం పెంచారే తప్పా వేతనాలు పెంచలేదని వారు దుయ్యబట్టారు. అధికారంలోకి వస్తే పంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచడంతో పాటు



రెగ్యులరైజ్ చేస్తామని హామీనిచ్చిన కాంగ్రెస్ అధికారంలోకొచ్చాక ఆ ఊసే ఎత్తడం లేదని ఆయన విమర్శించారు.బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని లేని పక్షంలో ఎంపిడిఓ కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ నెల 17న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. పంచాయతీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# నల్ల పోచమ్మ .. సల్లంగా చూడమ్మా

**కౌడిపల్లి, డిసెంబర్ 15(సిరిన్యూస్)** మెదక్ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన కౌడిపల్లి మండల పరిధిలోని తునికి గ్రామ శివారులో వెలిసిన శ్రీ నల్ల పోచమ్మ ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుండి భారీగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం ఆలయంలో ఆలయ పూజారులు శివప్ప, విగ్నేశ్, రాజేష్, అందంగా అలంకరించిన అమ్మవారికి అమృతాభిషేకం కుంకుమార్చన, ప్రత్యేక అలంకరణ , చేసి పూజ కార్యక్రమలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళా భక్తులు అమ్మవారికి ఓడి బియ్యం పోసి నైవేద్యం సమర్పించారు . భక్తులు తమ వద్ద అందంగా అలంకరించిన బోనాలు నెత్తిన పెట్టుకొని డప్పు దరువులతో పోతరాజుల నృత్యాలు, శివసత్తుల పూనకాలు నల్ల పోచమ్మకు జై అంటూ ఆలయం చుట్టూ



ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనం సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో తమ కోరికలు నెరవేరాలని మహిల భక్తులు ముడుపులు కట్టారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో రంగారావు సకల సౌకర్యాలను కల్పించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ వెంకటరెడ్డి, ఆలయ సిబ్బంది రాజు, అశోక్, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

# అంబులెన్స్ మంజూరు పట్ల హర్షం

### మాజీ సర్పంచ్ గోపి నాయక్

**వెల్దుర్తి, డిసెంబర్ 15 (సిరి న్యూస్):** మాసాయిపేట మండలానికి నూతనంగా 108 అంబులెన్స్ వాహనము కేటాయించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, వైద్య శాఖ మంత్రి దామోదర రాజానర్సింహాకు మండల పరిధిలోని రామంతాపూర్ తండా మాజీ సర్పంచ్ గోపి నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నిత్యం ప్రజలలో ఉండి ప్రజా సంక్షేమం ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గం ఇంచార్జి, తెలంగాణ రాష్ట్ర పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజి రెడ్డికి, జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. మాసాయి పేట్ మాజీ సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు కృష్ణారెడ్డి, సిద్ధిరాములు గౌడ్ ఉన్నారు.





## అండర్ 14కు విద్యార్థుల ఎంపిక

**పటాన్‌చెరు, డిసెంబర్ 15(సిరి న్యూస్)** ఉమ్మడి మెదక్ జిల్లా అండర్ 14 క్రికెట్ జుట్టుకు పటాన్చెరువు పట్టణాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల జిల్లా క్రికెట్ జట్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక శిబిరంలో. పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఏపీఆర్ కాలనీకి చెందిన ప్రభాకర్ రెడ్డి కుమారుడు శ్రీజన్ రెడ్డి, సాయిరాం ప్రసాద్ కుమారుడు సూరజ్ ప్రసాద్ లు జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారి తల్లిదండ్రులు మాట్లాడుతూ.. జిల్లాస్థాయి క్రికెట్ జట్టుకు ఎంపికోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించాలన్న లక్ష్యంతో వారికి శిక్షణ అందిస్తున్నామని తెలిపారు.



## అనాథకు ఆర్థిక సాయం

**చేగుంట, డిసెంబర్ 15(సిరి న్యూస్)** చేగుంట మండల కేంద్రంలో తల్లిదండ్రులు లేని అనాథ జంగల గణేష్ మరణించిన విషయం తెలుసుకొని అతని కుటుంబానికి చేగుంట మాజీ ఎంపీపీ అధ్యక్షుడు మాసుల శ్రీనివాస్ రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మండల పరిధిలో అనాథ కుటుంబాలకు అండగా ఉండడమే కాకుండా ఎవరికి ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటానని తెలిపారు.

## పరారీలోనే నిందితులు

**కొల్చారం, డిసెంబర్ 15(సిరి న్యూస్)** కొల్చారం మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి శివారు ఏడుపాయల వనదుర్గ సమీపంలోని దుర్గా భవాని రెస్ట్ హౌజ్‌లో పేకాట ఆడుతూ 11 మందిని రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. దీనికి ప్రధాన సూత్రధారు లైన వెంకట్ రెడ్డి. సంతోష్ సింగ్, రెస్ట్ హౌస్ యజమాని సాయి గౌడ్ ఇంకా పరారీలో ఉన్నారని మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

## అంబులెన్స్ మంజూరు చేసినందుకు మంత్రికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు

**కొల్చారం, డిసెంబర్ 15(సిరిన్యూస్)** కొల్చారం-నర్సాపూర్ రోడ్డుపైన చాలా ప్రమాదాలు జరుగుతున్నాయని, 108 అంబులెన్స్ అందుబాటులో లేక ప్రాణాలు కోల్పోతున్నారని అంబులెన్సులు ఇవ్వాలని వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి దామోదర రాజనర్సింహ్మాను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన మంత్రి కొల్చారం, వెల్దుర్తి మండలాలకు 108 అంబులెన్సులను మంజూరి చేయడం జరిగింది. ఈ మేరకు ఎమ్మెల్యే సునీతారెడ్డి మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

# పకడ్బందీగా గ్రూప్ -2 పరీక్షలు

- ఉమ్మడి జిల్లాలో ప్రశాంతం
- ఆలస్యం కావడంతో పలు వురికి చుక్కెదురు
- ఎంఎన్ఆర్ కాలేజీలో సెల్ ఫోన్ డిపాజిట్ పేర డబ్బులు వసూలు
- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్లు

**సంగారెడ్డి టౌన్, డిసెంబర్ 15(సిరిన్యూస్)** తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్షలు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల నడుమ ఆదివారం ప్రారంభం అయ్యాయి. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఈ పరీక్షలను నిర్వహించారు. సంగారెడ్డి కేంద్రంలోని సెయింట్ ఆంథోని, పయనీర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, ఎమ్మెన్నార్ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాన్ని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆదివారం ఉదయం సెషన్ లో జరిగిన పరీక్షకు జిల్లాలో 41 పరీక్ష కేంద్రంలో 15218 మంది అభ్యర్థులకు గాను పేపర్ 1 పరీక్షకు 7359 మంది హాజరు కాగా 7859 మంది గైర్హాజరు అయ్యారు. పేపర్ 2 పరీక్షకు 7206 మంది పరీక్షకు హాజరు కాగా 8012 మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. మొదటి సెషన్ పరీక్షకు



48 శాతం మంది విద్యార్థులు హాజరు అయ్యారు. 42 శాతం మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరు అయినట్లు అధికారులు తెలిపారు. పేపర్ 2(రెండవ సెషన్) పరీక్షకు 47.4 శాతం మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు అయ్యారని అధికారులు తెలిపారు. ఇలావుండగా పలువురు సమయానికి ఆలస్యంగా రావడంతో అధికారులు వారికి అనుమతినివ్వలేదు. న్యాల్‌కల్‌కు చెందిన గర్భిణి భాగ్య ఐదు నిమిషాల సమయం ఉన్నా అధికారులు అనుమతి ఇవ్వలేదని వాపోయింది.

### ఎంఎన్ఆర్ కాలేజీలో డబ్బులు వసూలు..

సంగారెడ్డి ఎమ్మెన్నార్ కళాశాలలో ఏర్పాటుచేసిన గ్రూప్ 2 పరీక్ష కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆకస్మిక తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలో సెల్ఫోన్ డిపాజిట్, లగేజీ డిపాజిట్ ల కోసం డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందడంతో అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా అభ్యర్థులు సెల్‌ఫోన్ డిపాజిట్ కొరకు 50 రూపాయలు వసూలు చేస్తున్నట్టు అదనపు కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. దీంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసి అభ్యర్థుల నుండి తీసుకున్న డబ్బులు తిరిగి ఇచ్చివేయాలని ఆదేశించారు. ఎవరికి కూడా డబ్బులు ఇవ్వవద్దని ఆయన తెలిపారు.

### మెదక్ జిల్లాలో ప్రశాంతం..

**మెదక్ ప్రతినిధి, డిసెంబర్ 15 (సిరి న్యూస్):** మెదక్ జిల్లాలో గ్రూప్-2 పరీక్షలు కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఆదివారం ప్రారంభం అయ్యాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును నిశితంగా పరిశీలించారు. నిబంధనలు పక్కాగా పాటిస్తున్నారా లేదా అన్నది గమనించి పలు సూచనలు చేశారు. కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ సాఫీగా పరీక్షలు నిర్వహించాలని అన్నారు. జిల్లాలో మొత్తం 5,855 మంది అభ్యర్థులకు గాను, ఆదివారం ఉదయం సెషన్ లో జరిగిన



పరీక్షకు 2,868 మంది హాజరు కాగా, 2,987 మంది గైర్హాజరు అయ్యారని, మధ్యాహ్నం సెషన్ లో 2859 పరీక్ష రాయిగా, 2,996 మంది గైర్హాజరు అయ్యారని వివరించారు. ఆది, సోమవారాలలో ఉదయం, మధ్యాహ్నం చొప్పున మొత్తం నాలుగు సెషన్లలో జరిగే గ్రూప్-2 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, పకడ్బందీగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వెల్లడించారు.



# సిఎస్ఐ చర్చిలో ఏసుక్రీస్తు జాతర మహోత్సవం

- వైభవంగా నిర్వహించిన కమిటీ సభ్యులు
- పాల్గొన్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**సంగారెడ్డి టౌన్, డిసెంబర్ 15(సిరిన్యూస్)** సంగారెడ్డిలోని సిఎస్ఐ చర్చిలో ఏసుక్రీస్తు జయంతి జాతర మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, బిషప్ రెవరెండ్ రూబెన్ మార్క్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి జాతరలో పాల్గొన్న ప్రజలను ఉద్దేశించి అందరికీ ముందస్తు క్రిస్మస్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. రెవరెండ్ బిషప్ రూబెన్ మార్క్ మాట్లాడుతూ భక్తులకు దైవ సందేశం వినిపించారు. జాతర మహోత్సవంలో జాతర కమిటీ సభ్యులు ఆల్బర్ట్ సునీల్, ప్రవీణ్ జయ కుమార్, జయరాజ్, భాస్కర్, జాన్ వెస్లీ, కాంగ్రెస్ నాయకులు తోపాజి అంత కిషన్, కున సంతోష్, కిరణ్ గౌడ్, సిఎస్ఐ చర్చ్ పాస్టర్ జార్జ్ ఎబినేజర్ రాజు, చర్చిల పాస్టర్లు, సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏడాది పాలనలో రేవంత్‌ది హిట్ వికెట్

- రాహుల్ అపాయింట్మెంట్ దొరకని పరిస్థితి నీది..
- ఒక్క ఇల్లయిన కట్టావా
- ప్రశ్నిస్తే ప్రజలపై దాడులు..
- అనుచరులకు అక్రమంగా నోట్లు
- సీఎం రేవంత్ రెడ్డి పై మంత్రి హరీష్ రావు ఫైర్



**పటాన్‌చెరు, డిసెంబర్ 15(సిరిన్యూస్)** మూడు రోజుల ఢిల్లీ పర్యటనలో ఏఐసీసీ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, సోనియాగాంధీ అపాయింట్మెంట్ దొరకని దుర్భర పరిస్థితిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని, 6 గ్యారంటీల హామీల అమలులో ఘోరంగా విఫలమయ్యారని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు విమర్శించారు. ఆదివారం సాయంత్రం అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని ఐలాపూర్ గ్రామంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కెసిఆర్ ట్రోఫీ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పై విమర్శల వర్షం కురిపించారు. క్రికెట్ ఆటలో హిట్ వికెట్ ఎలాగో వీడాది పాలనలో సీఎం రేవంత్ రెడ్డి పరిస్థితి అదేనని విమర్శించారు. ఏడాది పాలలో పేద ప్రజల కోసం ఒక్క ఇల్లు కట్టని కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో నిరుపేదల ఇల్లు కూలుస్తూ దుర్మార్గ పరిపాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. ప్రశ్నించిన ప్రతిపక్షాలపై.. ప్రజలపై దాడులు చేస్తూ.. అక్రమ కేసులు బనయిస్తున్నారని విమర్శించారు. దేవుళ్లపై ఓట్లు వేస్తూ.. ప్రజలను తిడుతూ.. అనుచరులకు మాత్రం నోట్లు అందిస్తున్నారని ఆరోపించారు. నేటి నుండి జరుగునున్న అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు ఎండగడుతూ.. ప్రజల పక్షాన నిలుస్తామని అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, పటాన్చెరు కార్పోరేటర్ మెట్టు కుమార్ యాదవ్,. సీనియర్ నాయకులు ఆదర్శ్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, సోమి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# చర్చికి భారీ విరాళం

### పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్

**పటాన్‌చెరు, డిసెంబర్ 15(సిరిన్యూస్)** కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్చెరు కార్పోరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఉన్నారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని పాటి శివారులో గల మరనాత చర్చిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వంటశాల నిర్మాణానికి కార్పొరేటర్ కుమార్ యాదవ్ ఆరు లక్షల రూపాయల భారీ విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన అనంతరం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని తెలిపారు. ప్రతి క్రిస్మస్ పండుగకు కానుకల అందించి వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సోమిరెడ్డి, చర్చి నిర్వాహకులు పాల్గొన్నారు.

Published by **Badhe Jayasree** on behalf of **Siri Media**. Published at Flat No. 104, Kapil Kausalya Apartment, Shilpa Cereny County Vencher, Near MBR Garden, Pothireddypally X Road, Sangareddy, Telangana State - 502201. Phone : **9697889922**. E-Mail : **siridailynews@gmail.com**.